సమీపిస్తున్న ఎన్నికలు..
ఏర్పాట్లలో అధికారులు

- క్షేత్రస్థాయి పర్యటనలు
- కంట్రోల్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఎంపిక
- పనుల్లో నిమగ్నమైన సికింద్రాబాద్ అధికారులు

సికింద్రాబాద్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికారులు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఎలక్షన్ సెల్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసిన అధికారులు, ఓయూ ప్రాంగణంలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలు 15న ఉపసంహరణల వరకు ఎన్నికల కార్యకలాపాలన్నీ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్ ద్వారా నిర్వహించనున్నారు. ఆపై జరిగే ఎన్నికల సంబంధిత కార్యకలాపాలు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవన సముదాయం నుంచి కొనసాగించనున్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కంట్రోల్ రూం నంబర్లు

మొబైల్ నెంబర్: 9492035001
రిటర్నింగ్ అధికారి నెంబర్: 99892 29215
మెయిల్: retunrningofficer secunderabad@gmail.com

కౌంటింగ్ వరకు..



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్‌లు భద్రపర్చడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 8న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు సికింద్రాబాద్ చేరుకోనున్నాయి. 210 పోలింగ్ స్టేషన్ల కోసం 210 ఈవీఎంలు, అదనంగా మరో 40 కలిపి మొత్తం 250 ఈవీఎంలను ఇక్కడే భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 7న ఇక్కడి నుంచే 210 పోలింగ్ కేంద్రాలను ఈవీఎంలు పంపించడం, పోలింగ్ పూర్తయ్యాక కౌటింగ్ తేదీ వరకు తిరిగి ఇదే భవనంలో భద్రపరుస్తారు.

కంట్రోల్ రూం..



సికింద్రాబాద్ ఉత్తర మండలం కార్యాలయంలోని 3వ అంతస్తులో ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక సిబ్బంది కంట్రోల్ రూమ్ కార్యాలయ విధుల్లో ఉంటున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జరిగే కార్యకలాపాలకు సంబంధించిన ఫిర్యాదులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సలహాలు సూచనలు కంట్రోల్ కేంద్రం సిబ్బంది స్వీకరిస్తారు. కంట్రోల్ రూమ్‌లో నేరుగా లేదా ఫోన్, మెయిల్‌ద్వారా ఫిర్యాదులు చేయొచ్చు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం...



ఓయూ ప్రాంగణంలో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసుకున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంలు భద్రపర్చడం మొదలు, ఓట్ల లెక్కింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఎంపిక చేసిన ఓయూ పరిధిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవన సముదాయంలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల అధికారులు, పోలీసులు అధికారులు పలుమార్లు ఈ భవనాన్ని సందర్శించి వసతులు, భద్రత అంశాలను పరిశీలించారు. ఎన్నికల కార్యక్రమాలన్నీ ఈ సముదాయం నుంచే కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రత్యేక కార్యక్రమాలు..



ఎన్నికల నిర్వహణతోపాటు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల శిక్షణ ఇస్తారు. అదే విధంగా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు ఈసారి దృష్టి సారిస్తున్నారు. బూత్‌లెవల్ ఆఫీసర్లతో పాటు, అన్ని రాజకీయ పార్టీల నుంచి పోలింగ్ ఏజెంట్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కాలనీ ప్రజలు ఎక్కువ సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు..



ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటర్లకు అనువైన వాతావరణాన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పోలీసులు, ఇతర విభాగాల అధికారుల సహకారం తీసుకుంటున్నాం. అర్హులైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

–ఎస్.ఎల్లారెడ్డి, రిటర్నింగ్ అధికారి

'బతుకమ్మ' విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందిస్తున్న దృశ్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అన్నపూర్ణ

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మలను పేర్చిన జెక్‌కాలనీ మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో అందంగా బతుకమ్మలను తయారుచేసిన ఐదుగురి విజేతలకు పట్టుచీరలు, పాల్గొన్న వారికి ఇతర బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని నాగమణి, రెండో బహుమతి ప్రభ అనంతరెడ్డి, మూడో బహుమతి స్వాతి, నాలుగో బహుమతి లత, ఐదో బహుమతి హరిత గెలుచుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బతుకమ్మ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు వైభవంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ప్రభ అనంతరెడ్డి, కొండ్రాజు రమణమ్మ, విజయలక్ష్మీ, ఆదిలక్ష్మీదేవి, పూర్మాని భాగ్యలత తదితరులతో పాటు సుమ, వాణి పాల్గొన్నారు.

నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో

చిలకలగూడ : చిలకలగూడ నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పోటీ విజేతలకు అసోషియేషన్ ఛైర్మన్ నాగులూరి సాయిబాబా బహుమతులు అందించి అభినందించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై ఉన్న మమకారంతో ప్రతిఏటా నాగులూరి జీహెచ్‌ఎంసీ పార్కులో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు సాయిబాబా తెలిపారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు శర్మ, తుమ్మ శ్రీనివాస్, యాదగిరి, సతీష్, ఆంజనేయులు, ప్రమోద్ పాల్గొన్నారు.


పండితులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 18, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 13, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 35, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 11, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 21, చామగడ్డ 23, మొరంగడ్డ 18, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓటరు నమోదుకు ఆరు రోజులే


సనత్‌నగర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఓటు వేసే హక్కు పొందేందుకు మరో ఆరు రోజులే అవకాశం ఉంది. అలాగే ఈ నెల 30 లోగా జాబితాలో తమ ఓటు ఉందో లేదో చెక్ చేసుకోవాలని, లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా గడువులోగా మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

టెక్స్‌టైల్ మెషినరీ ప్రారంభం


ఎంబ్రాయిడరీ మెషిన్ ప్రారంభిస్తున్న లహరి షారి

అమీర్‌పేట: టెక్స్‌టైల్ మెషినరీ కంపెనీ నగరానికి రావడం సంతోషదాయకమని సినీనటి లహరి అన్నారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులో ఏర్పాటు చేసిన బాబా టెక్స్‌టైల్ మెషినరీని మంగళవారం లహరి ప్రారంభించి మాట్లాడారు. అన్ని టెక్స్‌టైల్ పరిశ్రమల్లో మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నారని బాబా టెక్స్‌టైల్ ఎంబ్రాయిడరీ మెషినరీ ద్వారా వ్యాపారాలు చేసుకునే వీలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాఖీదేవి పరశురాం పూరియా, మురారి, ముకుంద్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థి ముడావత్ వాల్యాకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి పర్యవేక్షణలో ట్రైబల్ డెవలప్‌మెంట్ సబ్–ప్లాన్ స్కీమ్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఎ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఇప్లూ వీసీ ప్రొ.సురేష్‌కుమార్ పరిశోధనకు సహకరించినట్లు తెలిపారు.

ముగిసిన హునర్ మహోత్సవ్


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ శుక్లా

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన హునర్ మహోత్సవ్‌కు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు దీపక్ శుక్లా తెలిపారు. మంగళవారం జరిగిన ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు హస్త, చేనేత కళాకారులు రూపొందించిన కళాఖండాలు, ఖాదీ ఉత్పత్తులు, ఉడెన్ ఫర్నిచర్, రాజస్థానీ ఆభరణాలు తదితర వాటిని కొనుగోలు చేశారన్నారు. వినియోగదారుల డిమాండ్ మేరకు త్వరలో మరోసారి ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు ఆర్.ఎహసన్, అస్గర్ అసితంట్, ఆర్.రాధగౌర్, ఎల్.మెహందిహసన్, బి.మన్సూర్ అబ్బాస్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన హెచ్‌సీఏ ప్రతినిధులు



సనత్‌నగర్: ఇటీవల జరిగిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎన్నికల్లో సెక్రటరీగా గెలిచిన దేవరాజ్, కౌన్సిల్ మెంబర్ సునీల్ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలువగా వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసిన అమర్నాథ్, శేష నారాయణ, శివాలాల్‌యాదవ్ కూడా మంత్రిని కలిశారు.

మూగజీవాలకు ఆహారం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ క్యాంపస్‌లో జీవిస్తున్న మూగజీవాలకు ప్రతి రోజు ఆహారాన్ని అందిస్తున్నారు. క్యాంపస్‌లో సంచరిస్తు న్న కుక్కలు, పావురాలు, వివిధ రకాల పక్షులకు 2 001 నుంచి ఆహారాన్ని అందచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు రూ.300 చొప్పున నెలకు రూ.9 వేలను మూగజీవాల ఆహారానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.


కుక్కలకు ఆహారం పెడుతున్న ప్రొ.చంద్రునాయక్

క్రైం కార్నర్..

అనారోగ్యంతో మహిళ మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం ... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నంబర్–1 లో సుమారు 55–60 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వృద్ధురాలు అపస్మారకస్థితిలో పడి ఉంది. ఇది గమనించిన ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించి గాంధీ మార్చురీకి తరలించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిసాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో శ్రీవారి వాహనసేవలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను వేలాది మంది భక్తులు వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆగమశాస్త్ర పండితుడు మాడ్వాభూల రమాకాన్తాచార్యుల నేతృత్వంలో మహాపూర్ణాహుతి, కలశాభిషేకం, చక్రతీర్థం, పుష్పయాగం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులను శాలువాలతో సన్మానించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు, పలు విభాగాల అధికారులు, సిబ్బందికి ఈఓ రాజేష్‌కుమార్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ వేణుగోపాలరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీ నారాయణ, ఆత్మారామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివ శంకర్, సుజయ్ ప్రకాశ్, వెంకటరమణ, రామచందర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పూజ కార్యక్రమం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ హమాల్‌బస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 25(నేడు) నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు హాజరవుతారన్నారు. గురువారం బస్తీలో పెద్ద ఎత్తున బోనాలు ఉంటాయన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కుమార్ గౌడ్

ఆనందోత్సాహాలతో దసరా వేడుకలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ప్రజలు దసరా వేడుకలను ఆనందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ప్రజలు తమ సమీపంలోని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. చరిత్రాత్మక జీరా నవగ్రహ హనుమాన్ దేవాలయం, లాలాగుడి దేవాలయాల్లో దసరా పండుగ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ బంధువులు, ఆత్మీయులను ఆలింగనం చేసుకొని జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలిపారు. వాహన పూజతో పాటు ఆయుధ పూజ చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌పీ పోటీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాలకు పోటీ చేయనున్నట్లు తెలంగాణ రిపబ్లికన్ పార్టీ (టీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షులు నక్క యాదీశ్వర్ పేర్కొన్నారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు టీఆర్‌పీ కృషి చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేయాలని మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. ఉత్సాహవంతులైన తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు, మహిళలు, యువత, కార్మికులు, ఇతర వర్గాల జనాబా ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు.



తార్నాక డివిజన్‌లోని లాలాపేట అంతట చివరి రోజు నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. అందంగా పేర్చిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. –లాలాపేట

దసరా సంబరం.. రావణ దహనం

దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. వాడవాడలా విజయదశమి సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. జమ్మిచెట్టుకు పూజచేసి జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై జమ్మిచెట్టు పూజ చేసి అందరికి దసరా పండగ శుభాకాంక్షలు చెప్పారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ కంటోన్మెంట్ జోన్ల బృందం


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


సనత్‌నగర్ రామ్‌లీలా మైదానంలో..


అమీర్‌పేట్‌లోని శాంతినగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


లాలాపేటలో రావణ దహనం


రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్న నరసింహన్ కన్నన్


మహిషాసురమర్దినిగా ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారు


అమీర్‌పేట హనుమాన్ దేవస్థానంలో మర్రి శశిధర్‌రెడ్డి పూజలు


ప్రసన్న వెంకన్నస్వామి ఆలయంలో జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న దృశ్యం


కల్యాణ వెంకన్నస్వామి ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావును సన్మానిస్తున్న దృశ్యం